ముహూర్తం కోసం చూస్తున్నారా?

- అస్సాం ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం
- విదేశీయులను ఏండ్ల తరబడి నిర్బంధించడంపై ఆశ్చర్యం
- రెండు వారాల్లోగా వారందరినీ పంపి వేయాలని ఆదేశం
- శాశ్వతంగా నిర్బంధ కేంద్రాల్లో ఉంచకూడదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: విదేశీయులుగా ప్రకటించిన వారి విషయంలో అస్సాం ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విదేశీయులుగా గుర్తించిన వారిని ఎందుకు పంపడం లేదు.. ఏదన్నా మంచి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారా? అని ప్రశ్నించింది. ఎన్ఆర్సీ సందర్భంగా గుర్తించిన 63 మంది విదేశీయులను ఇంకా నిర్బంధ కేంద్రాలలో ఎందుకు నిరవధికంగా ఉంచారని అడుగుతూ.. వారిని రెండు వారాల్లోగా వారి దేశాలకు పంపించి, దానిపై నివేదిక సమర్పించాలని మంగళవారం ఆదేశించింది. వారి చిరునామాలు లభ్యం కాలేదని, అందుకే వారిని పంపలేకపోతున్నామంటూ అస్సాం ప్రభుత్వం ఇచ్చిన వివరణ పట్ల న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. 'వారిని దేశ బహిష్కారం చేయకుండా మీరు ఇంకా మీనమీషాలు లెక్కపెడుతున్నారు. వారి చిరునామాలు లేకపోతే మనకెందుకు ఆందోళన, వారి దేశాల రాజధానులకు పంపేయండి. వారిని పంపడానికి శుభ ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగం 21 ప్రకారం వారిని శాశ్వతంగా నిర్బంధ కేంద్రాల్లో ఉంచలేమని పేర్కొంది. అస్సాంలో చాలా నిర్బంధ కేంద్రాలు ఉన్నాయని, ఇంతవరకు ఎంతమందిని దేశ బహిష్కారం చేశారని ధర్మాసనం ప్రశ్నించింది. ఇది రాష్ట్రానిది కాదు.. కేంద్రానికి సంబంధించిన విషయమని, సమస్యను కేంద్రం దౌత్యమార్గంలో పరిష్కరించాలని, సంబంధిత వ్యక్తులతో దీనిపై చర్చిస్తానని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. జాతీయత తెలియని వారి విషయంలో ఎలాంటి వైఖరి అనుసరించాలనుకుంటున్నారు తదితర వివరాలతో కేంద్రం నివేదిక సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం.. కేసును 25కు వాయిదా వేసింది.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నేడే

- బరిలో 699 మంది అభ్యర్థులు
- హ్యాట్రిక్ గెలుపుపై ఆప్ కన్ను
- 25 ఏండ్ల తర్వాత ఢిల్లీలో పాగాకు బీజేపీ ప్రయత్నాలు
- ఉనికి కోసం కాంగ్రెస్ పాట్లు
- ఈ నెల 8న ఫలితాల ప్రకటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఢిల్లీ శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. 1.56 కోట్ల ఓటర్లున్న దేశ రాజధానిలో ఓటింగ్ కోసం 13,766 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 70 స్థానాల్లో 699 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 220 కంపెనీల పారా మిలటరీ దళాలు, 35 వేల మంది ఢిల్లీ పోలీసులు, 19 వేల మంది హోంగార్డులను పోలింగ్ భద్రత కోసం ఈసీ వినియోగిస్తున్నది. మూడు వేల పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా పేర్కొన్న ఈసీ ఆ ప్రాంతాల్లో అదనంగా భద్రతా దళాలను మోహరించి, డ్రోన్లతో ఓటింగ్‌ను పర్యవేక్షించనుంది. ఈ నెల 8న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ఉవ్విళ్లూరుతున్నది. మరోవైపు, 25 ఏండ్ల తర్వాత మళ్లీ ఢిల్లీ గద్దెనెక్కాలని బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతున్నది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవని కాంగ్రెస్.. ఈ సారి ఎలాగైనా సత్తా చాటాలని భావిస్తున్నది.

కేజ్రీవాల్‌పై హర్యానాలో కేసు

కాగా మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై హర్యానాలో కేసు నమోదైంది. యమునా నదీ జలాలను విషతుల్యం చేశారని కేజ్రీవాల్ చేసిన ఆరోపణపై ఈ కేసు నమోదు చేశారు. విద్వేష వ్యాప్తి, తప్పుడు ఆరోపణలు, అల్లర్ల ప్రేరేపణ తదితర ఆరోపణతో వివిధ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది.

250 మంది | భారతీయులు వెనక్కి

- అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం
- అమెరికా నుంచి అమృత్‌సర్‌కు తొలి విమానం
- సుమారు 18 వేల మంది భారతీయులను స్వదేశానికి పంపనున్న అమెరికా ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. వారిని అమెరికా నుంచి స్వదేశాలకు సాగనంపుతున్నారు. ఇందులో భాగంగా అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 250 మంది భారతీయులతో కూడిన విమానం టెక్సాస్ నుంచి అమృత్‌సర్‌కు బయలుదేరింది. రాబోయే రోజుల్లో మరింత మందిని భారత్‌కు పంపించే అవకాశం ఉన్నది. వచ్చే వారం అమెరికాలో ప్రధాని మోదీ పర్యటించనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

18 వేల మంది భారతీయులతో లిస్టు

అమెరికాలో మొత్తం 1.10 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉండగా, అందులో సరైన పత్రాలు లేని భారతీయులు ఏడున్నర లక్షల మంది వరకు ఉన్నట్టు అంచనా. మెక్సికో, ఎల్ సాల్వడోర్ తర్వాత భారతీయులే అధికం. ఇప్పటికే ఆ దేశ ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు 18 వేల మంది భారతీయుల లిస్టును తయారు చేసినట్టు బ్లూమ్‌బర్గ్ న్యూస్ తెలిపింది. సుమారు 20,407 మంది భారతీయులకు సరైన పత్రాలు లేవని, వారిలో 17,940 మందిని పంపించి వేయడానికి జాబితా సిద్ధంగా ఉందని వెల్లడించింది. వీరిలో ఇప్పటికే 2,467 మంది అమెరికా ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం శిక్ష అనుభవిస్తూ అక్కడి నిర్బంధ కేంద్రాల్లో ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఏమంటున్నది?

మోదీ ప్రపంచంలోనే శక్తిమంతమైన ప్రధాని అని, ఆయనే తమను రక్షిస్తారని పలువురు భారతీయ వలసదారులు పెట్టుకున్న ఆశలు వమ్మయ్యాయి. అమెరికా డిపోర్టేషన్‌కు ఆయన పూర్తి మద్దతు ఇస్తున్నారన్న విషయం ట్రంప్ చర్యల ద్వారా వెల్లడవుతున్నది. ఏది సరైనదో అది భారత్ చేస్తుందని ఇటీవల ప్రధాని మోదీతో సంభాషణ సందర్భంగా ట్రంప్ పేర్కొన్నారు. కాగా, అక్రమ వలసలతో వ్యవస్థీకృత నేరాలకు సంబంధం ఉన్నందున తాము సైతం వాటిని వ్యతిరేకిస్తున్నట్టు ఇప్పటికే మన విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. వారి భారతీయతను ధ్రువీకరించే పత్రాలను తమతో పంచుకుంటే వారిని వెనక్కి తీసుకుంటామని ఆయన యూఎస్‌కు చెప్పారు. ఏ దేశమైనా చట్టబద్ధ పౌరులను మాత్రమే తమ దేశంలో ఉండటానికి అనుమతిస్తుందని, దానికి అమెరికా మినహాయింపు కాదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు.

ఎదురు తిరిగితే ఆంక్షలు తప్పవు

తాము వెనక్కి పంపించే వలసదారులను ఆయా దేశాలు అంగీకరించాల్సిందేనని అమెరికా స్పష్టం చేసింది. వారిని తిరస్కరించే దేశాలపై ఆంక్షలు తప్పవని హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ స్పీకర్ మైక్‌జాన్సన్ హెచ్చరించారు. అమెరికా కాంగ్రెస్ కూడా ఈ ఆంక్షలు విధించడానికి సమ్మతి తెలిపిందన్నారు. కాగా, ఇటీవల అమెరికా పంపిన అక్రమ వలసదారులను తీసుకోవడానికి తిరస్కరిస్తూ వారితో వస్తున్న మిలటరీ విమానం ల్యాండింగ్‌కు కొలంబియా దేశం తిరస్కరించింది. దీంతో కొలంబియా నుంచి వచ్చే దిగుమతులపై ట్రంప్ 25 శాతం సుంకాలు విధించారు. దీనికి భయపడ్డ ఆ దేశం వెంటనే తన విమానాలను అమెరికాకు పంపి ఆ దేశంలో ఉన్న అక్రమ వలసదారులకు వెనక్కి తీసుకురావడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం ఆగింది.

అమెరికాపై చైనా కౌంటర్ టారిఫ్‌లు

అగ్ర దేశ ఉత్పత్తులపై 10-15% సుంకాలు

బీజింగ్, ఫిబ్రవరి 4: తమ దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలపై చైనా ప్రతీకార చర్యలు చేపట్టింది. అమెరికా నుంచి దిగుమతవుతున్న నాచురల్ గ్యాస్, క్రూడాయిల్ తదితర ఉత్పత్తులపై తాను సైతం సుంకాలు వేస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. అయితే ఇది వచ్చే సోమవారం నుంచి అమలులోకి వస్తుందని తెలిపింది. కొన్ని వస్తువులపై 15 శాతం, మరికొన్నింటిపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించింది. అంతే కాకుండా గూగుల్, ఇతర వాణిజ్య సంస్థలపై యాంటీట్రస్ట్ (బహుళ జాతి సంస్థల వల్ల కలిగే దుష్ప్రభావాల వ్యతిరేక చట్టం) దర్యాప్తును ప్రారంభించింది. సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల రవాణాపై మెక్సికో, కెనడా ఆందోళన వ్యక్తం చేసిన క్రమంలో ఆ రెండు దేశాలపై విధించిన సుంకాల అమలును 30 రోజుల పాటు నిలిపివేయడానికి ట్రంప్ అంగీకరించారు. అయితే చైనాపై ముందు ప్రకటించిన విధంగా మంగళవారం నుంచే వాటి అమలును ప్రారంభించారు. కాగా, సుంకాలపై ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో ట్రంప్ కొద్ది రోజుల్లో చైనా అధ్యక్షుడు లీ జిన్‌పింగ్‌తో చర్చలు జరిపే యోచనలో ఉన్నారు. రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ జరగడం ఇదే మొదటి సారి కాదు. 2018లో సైతం ట్రంప్ చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై టారిఫ్ పెంచగా, అప్పట్లో డ్రాగన్ దేశం కూడా దీటుగానే స్పందించింది.

'డోజ్'లో మన కుర్రాడు

భారత సంతతి యువకుడికి మస్క్ టీంలో చోటు

న్యూయార్క్, ఫిబ్రవరి 4: ఆటోమేషన్ సాయంతో అమెరికా ప్రభుత్వ రోజూవారీ కార్యకలాపాల్లో వృథా ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా ఎలాన్ మస్క్ నేతృత్వంలో ఏర్పాటైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (డోజ్)లో భారత సంతతి కుర్రాడికి చోటు దక్కింది. 22 ఏండ్ల ఆకాశ్ బొబ్బ మస్క్ నేతృత్వంలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు.ట్రంప్ సర్కారు డోజ్ కోసం ఆరుగురు ఇంజినీర్లను నియమించుకోగా.. వారందరి వయసు 19-24 ఏండ్ల మధ్యే.

ఎవరీ ఆకాశ్?

భారత సంతతి కుర్రాడు ఆకాశ్‌కు మస్క్ టీంలో చోటు దక్కడంతో అతని గురించి ఇప్పుడు నెట్టింట చర్చ జరుగుతున్నది. డిలీట్ అయిన ఆకాశ్ లింక్డ్ ఇన్ ప్రకారం.. అతను బెర్కెలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో మేనేజ్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ (ఎంఈటీ) ప్రోగ్రామ్ చేశారు. మెటా, పలంటీర్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేశారు. బ్రిడ్జ్‌వాటర్ అసోసియేట్స్ కంపెనీలో ఏఐ, డాటా ఎనలిటిక్స్, ఫైనాన్షియల్ మోడలింగ్ విభాగంలో కొంతకాలం పనిచేసినట్టు తెలుస్తున్నది. ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో ఆకాశ్ నిపుణుడు. డోజ్‌కు కొత్త చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమితులైన అమందా స్కేల్స్‌కు అతను నేరుగా రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని సమాచారం. వైర్డ్ ప్రకారం... ఆకాశ్‌కు జీఎస్ఏలో అన్ని ఐటీ సిస్టమ్‌లకు యాక్సెస్ ఉన్నట్టు తెలుస్తున్నది.

రెండేండ్లలో 1.55 కోట్ల కూలీల పేర్లు తొలగింపు

'ఉపాధి హామీ'పై కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: 2022-2024 మధ్య కాలంలో 1.55 కోట్ల మంది క్రియాశీల కూలీల పేర్లను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి తొలగించినట్టు కేంద్రం మంగళవారం పార్లమెంట్‌కు తెలిపింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి కమలేశ్ పాశ్వాన్ ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిస్తూ.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 86.17 లక్షలు, 2023-24లో 68.86 లక్షల మంది కూలీల పేర్లను తొలగించినట్టు చెప్పారు. నకిలీ లేదా డూప్లికేట్ లేదా సరైనవి కాని జాబ్ కార్డుల కారణంగా, కుటుంబాలు తమ గ్రామ పంచాయతీ నుంచి శాశ్వతంగా నివాసాన్ని మార్చడం వల్ల ఈ తొలగింపులు చేశామన్నారు. పథకాన్ని అమలు చేసే బాధ్యత రాష్ట్రాలు, యూటీలపైనే ఉంటుందన్నారు.

అమెరికా పోలీసులపై సుచిర్ తల్లిదండ్రుల దావా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: తమ కుమారుడి మరణానికి సంబంధించిన దర్యాప్తు నివేదికలను దాచిపెడుతున్నారని ఆరోపిస్తూ ఓపెన్ ఏఐ విజిల్‌బ్లోయర్ సుచిర్ బాలాజీ తల్లిదండ్రులు పూర్ణిమ రామారావు, బాలాజీ రామమూర్తి శాన్ ఫ్రాన్సిస్కో పోలీసు శాఖ(ఎస్ఎఫ్‌పీడీ)పై అక్కడి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దర్యాప్తు నివేదికలను తమకు అందుబాటులో ఉంచాలని, కేసును మూసివేశామంటూ డిసెంబర్‌లో ఎస్ఎఫ్‌పీడీ అధికారులు తమకు ఇచ్చిన సమాచారంపై విచారణ జరగాలని శుక్రవారం దాఖలు చేసిన పిటిషన్‌లో వారు కోరారు. దర్యాప్తు నివేదికప్రతిని తమకు ఇవ్వాలన్న తమ అభ్యర్థనను ఎస్ఎఫ్‌పీడీ తోసిపుచ్చిన విషయాన్ని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఇద్దరిని హత్య చేసిన మావోయిస్టులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 4: పోలీస్ ఇన్ఫార్మర్లనే నెపంతో మావోయిస్టులు ఇద్దరు గ్రామస్తులను హత్య చేసినట్లు తెలుస్తున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుడ్డి గ్రామానికి చెందిన రాజు కరం, మున్న మాద్విపై ఇన్ఫార్మర్ల ముద్రవేసి హత్య చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు, భద్రతా బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన బీజాపూర్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గుజరాత్‌లోనూ యూసీసీ?

గాంధీనగర్: ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలుపై గుజరాత్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసింది. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి రంజన దేశాయ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటుచేస్తున్నట్టు సీఎం భూపేంద్ర పటేల్ మంగళవారం ప్రకటించారు. రాష్ట్రంలో యూసీసీ అవసరం అంచనావేయడానికి, ముసాయిదా బిల్లును రూపొందించటానికి ఈ ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసినట్టు సీఎం వెల్లడించారు. కమిటీ తన నివేదికను 45 రోజుల్లో ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు.

వైద్యుల నిర్లక్ష్యంపై రోగులు ఫిర్యాదు చేయొచ్చు

అనుమతిస్తూ ఎన్ఎంసీ నిర్ణయం!

న్యూఢిల్లీ: చికిత్స విషయంలో వైద్యుల నిర్లక్ష్యం, వృత్తిలో అనుచిత వైఖరి తదితర అంశాలపై రోగులు ఇచ్చే ఫిర్యాదులను నేరుగా వినాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. అలాగే రాష్ట్ర వైద్య మండలి (ఎస్ఎంసీ) నిర్ణయాలకు వ్యతిరేకంగా కూడా ఎన్ఎంసీ ఆధ్వర్యంలోని ఎథిక్స్ అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు (ఈఎంఆర్‌బీ)కి రోగులు ఫిర్యాదు చేయవచ్చు. 2023లో జరిగిన సమావేశంలో కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందని, అయితే దీనిని అధికారికంగా ఆమోదించాల్సి ఉందని ఎన్ఎంసీ కార్యదర్శి బీ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్ఎంసీ చట్టం 2019 ప్రకారం ఎస్ఎంసీలకు ఫిర్యాదు చేయడానికి, వాటి నిర్ణయాలపై ఈఎంఆర్‌బీలలో అప్పీల్ చేయడానికి వైద్య వృత్తి నిపుణులు మాత్రమే అర్హులు. అయితే గత ఏడాది జరిగిన సమావేశంలో వైద్య సేవల్లో అసంతృప్తి, సేవా లోపాలపై రోగులకు సైతం ఫిర్యాదు చేసే హక్కు ఉండాలని భావిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు.

వారు రాజ్యాంగాన్ని అర్థం చేసుకోలేరు!

- భారత రాజ్యంపై యుద్ధం ప్రకటించిన వారికి దేశ ఐక్యత గురించి ఏం తెలుస్తుంది?
- లోక్‌సభలో రాహుల్‌గాంధీపై విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం లోక్‌సభలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కొందరు వ్యక్తులు బహిరంగంగా అర్బన్ నక్సల్స్ భాష మాట్లాడుతున్నారంటూ రాహుల్ పేరును నేరుగా ప్రస్తావించకుండా మోదీ మాటల దాడి చేశారు. భారత రాజ్యంపై యుద్ధం ప్రకటించిన వారికి రాజ్యాంగం గురించి గాని దేశ ఐక్యత గురించి కాని అర్థం చేసుకోలేరని ఆయన విమర్శించారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చకు ప్రధాని మోదీ సమాధానమిస్తూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పైన, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)పైన ఆరోపణలు గుప్పించారు. యువత భవిష్యత్తుకు కొన్ని పార్టీలు ఆపద(ఆపద) అంటూ ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వ పథకాలతో ప్రజల డబ్బు అయిందని, కాని తాము మాత్రం అద్దాల మహల్ కట్టుకోలేదని పరోక్షంగా కేజ్రీవాల్ నిర్మించుకున్న అధికారిక నివాసాన్ని మోదీ ప్రస్తావించారు. పేదల గుడిసెల్లోకి వెళ్లి ఫొటోలు తీసుకునే వారికి పార్లమెంట్‌లో పేదల గురించి మాట్లాడితే విసుగ్గానే ఉంటుందంటూ ఆయన రాహుల్‌పై ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకుని తిరిగేవారికి ముస్లిం మహిళలు కష్టాలు ఎదుర్కోవడానికి తామే కారణమని తెలుసా అని మోదీ ప్రశ్నించారు. ట్రిపుల్ తలాక్ చట్టం ద్వారా ముస్లిం మహిళలకు హక్కులు కల్పించామని ప్రధాని ప్రకటించారు. తాము బూటకపు నినాదాలు ఇవ్వబోమని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని చేసి చూపిస్తున్నామని ఆయన తెలిపారు. ఐదు దశాబ్దాల క్రితం వరకు గరీబీ హఠావో నినాదాలు వినిపించేవని, ఇప్పుడు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయట పడ్డారని మోదీ తెలిపారు. 4 కోట్ల మంది పేదలకు ఇళ్లు లభించాయని ఆయన చెప్పారు.

రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం?

స్పీకర్ దృష్టికి 'చైనా సైన్యం తిష్ట' వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. భారత గడ్డపై చైనా సైన్యం తిష్ట వేసిందని పార్లమెంట్‌లో సోమవారం రాహుల్ చేసిన వ్యాఖ్యలు పాలక, ప్రతిపక్షాల మధ్య మంటలు రేపాయి. రాహుల్ అబద్ధాలు చెప్తున్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. 'రాహుల్ చరిత్రను, వాస్తవాలను సిగ్గు లేకుండా వక్రీకరించారు. మన దేశాన్ని అపహాస్యం చేయడానికి, మన గణతంత్ర ప్రతిష్ఠను తగ్గించడానికి ప్రయత్నించారు' అని దూబే తన లేఖలో పేర్కొన్నారు. తాను చేసిన ఆరోపణలకు రాహుల్ ఆధారాలు చూపకుంటే ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రతిపాదించాలని దూబే యోచిస్తున్నట్టు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. భారత్‌కు చెందిన 4 వేల చ.కి.మీ భూమిలో బీజింగ్(చైనా) తిష్ట వేసిందని రాహుల్ గాంధీ సోమవారం పార్లమెంట్‌లో వ్యాఖ్యానించారు.

అదేమంత పెద్ద ప్రమాదం కాదు

కుంభమేళా తొక్కిసలాట ఘటనపై బీజేపీ ఎంపీ హేమమాలిని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో గంగ, యమున, సరస్వతి(అంతర్వాహిని) నదుల సంగమ స్థలి వద్ద "చక్కని స్నానం" చేసినట్లు ఇటీవల వ్యాఖ్యానించిన మథుర‌ కు చెందిన బీజేపీ ఎంపీ హేమమాలిని తాజాగా మరో వివాదానికి తెరతీశారు. జనవరి 29న మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 30 మంది మరణించడం, మరో 60 మందికిపైగా గాయపడిన సంఘటనను అదేమంత పెద్ద ప్రమాదం కాదు అంటూ వ్యాఖ్యానించారు. మహాకుంభ్‌లో జరిగిన ఘటన పెద్ద ప్రమాదమేమీ కాదని అన్నారు. మహా కుంభ్ కోసం సీఎం యోగి ప్రభుత్వం చక్కని ఏర్పాట్లు చేసిందని ప్రశంసించారు. ఊహించని రీతిలో భక్తులు ప్రవాహంలా వస్తున్న దృష్ట్యా అంత మందిని కట్టడి చేయడం ఎవరికైనా కష్టమేనని, ప్రతిపక్షాలు తమకు తోచింది మాట్లాడుతుంటాయని, విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని హేమమాలిని విమర్శించారు.

కుంభమేళా మృతుల సంఖ్య ఎందుకు దాస్తున్నారు?

న్యూఢిల్లీ: మహా కుంభమేళా మృతుల సంఖ్యను డబుల్ ఇంజిన్ సర్కార్ ఎందుకు దాస్తున్నదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. జనవరి 29నాటి ఘటనలో వాస్తవాలు బయటపెట్టడం లేదని ఆయన ఆరోపించారు. కుంభమేళా నిర్వహణ ఆర్మీకి అప్పగించాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం లోక్‌సభలో మాట్లాడుతూ, తొక్కిసలాట ఘటనపై వివరాలన్నీ పార్లమెంట్ ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

కుంభ్ తొక్కిసలాట మృతులు 2 వేల మంది: రౌత్

న్యూఢిల్లీ: మహా కుంభమేళా తొక్కిసలాటలో 2,000 మంది మరణించారని ప్రకటించి శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ మంగళవారం రాజ్యసభలో అలజడి సృష్టించారు. దీంతో తన ప్రకటనకు తగిన ఆధారాలు చూపాలని రౌత్‌ను రాజ్యసభ డిప్యుటీ చైర్మన్ హరివంశ్ ఆదేశించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా, అధికారిక లెక్కలను రౌత్ ప్రశ్నించారు. రౌత్ వ్యాఖ్యలపై అధికార పక్షం నిరసన వ్యక్తం చేసింది.

చంద్రునిపైకి ఫ్లయింగ్ రోబో

బీజింగ్: చంద్ర మండల అన్వేషణలో జోరుగా ముందుకు సాగుతున్న చైనా త్వరలో ప్రతిష్టాత్మక 'చాంగే-7' ప్రయోగాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతున్నది. చంద్రుని దక్షిణ ధృవంలో నీటి జాడలను కనుగొనేందుకు 6 కాళ్లతో కూడిన ఓ ఫ్లయింగ్ రోబోను పంపబోతున్నట్టు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక వెల్లడించింది. 'చాంగే-7' మిషన్‌లో అధునాతన 'ఫ్లయింగ్ డిటెక్టర్' రాకెట్ ప్రొపల్షన్‌ను ఉపయోగించుకుని పాకడం, దూకడం, పైకి ఎగరడం ద్వారా గతంలో ఎవరూ ప్రవేశించలేని ప్రాంతాలను అన్వేషించగలుగుతుంది.

వినికిడి లోపం ఉన్నవారి కోసం 'స్మార్ట్ గ్లాసెస్'

వాషింగ్టన్: మనకు తెలిసిన వినికిడి పరికరాలను వినియోగించటంలో సామాజికంగా, ఆర్థికంగా కొన్ని అడ్డంకులు ఉన్నాయి. వీటిని పరిష్కరించే ఉద్దేశంతో ఒక స్టైలిష్ లుక్‌తో తయారుచేసిన 'స్మార్ట్ గ్లాసెస్' (న్యూయాన్స్ ఆడియో గ్లాసెస్) ఇప్పుడు అమెరికాలో అందుబాటులోకి రాబోతున్నాయి. వీటి అమ్మకాలకు ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) తాజాగా ఆమోదం తెలిపింది. 2025లో అమెరికా, యూరప్‌దేశాల్లో వీటి అమ్మకాలు మొదలవుతాయని 'ఈజిలియర్ లక్సోటికా' కంపెనీ తాజాగా వెల్లడించింది. 'రెండు కీలకమైన ఇంద్రియాలను మెరుగుపర్చే 'స్మార్ట్ గ్లాసెస్' తీసుకురావాలనుకున్నాం. వినికిడి పరికరాల తయారీలో ఇదొక గొప్ప ముందడుగు అవుతుంది' అని కంపెనీ సీఈవో చెప్పారు.

పిల్లల్లో లెక్కల భయం.. పేరెంట్స్ నుంచే!

న్యూఢిల్లీ: కొందరు పిల్లలకు లెక్కలంటే భయం. దీనికి కారణం ఆ పిల్లల తల్లిదండ్రులేనని తాజా అధ్యయనం ఒకటి పేర్కొన్నది. లెక్కలు, అంకెలు.. అంటే తల్లిదండ్రులు భయపడితే, అయిష్టత చూపితే.. వారి పిల్లలు కూడా ప్రైమరీ, ప్రీ-ప్రైమరీ విద్యలో గణితం సబ్జెక్ట్‌లో వెనుకబడుతున్నారని పరిశోధకులు తెలిపారు. గణితం పట్ల ఆసక్తికనబర్చే తల్లిదండ్రుల పిల్లల్లో 'మ్యాథ్స్ యాంగ్జైటీ' లేదని అధ్యయనం తెలిపింది. లూఫ్‌బోర్ యూనివర్సిటీ (ఇంగ్లాండ్) పరిశోధకుల అధ్యయనం ప్రకారం, 'మ్యాథ్స్ యాంగ్జైటీ' తీవ్రంగా ఉన్న 126 మంది తల్లిదండ్రులను, వారి పిల్లల గణిత నైపుణ్యాల్ని సైంటిస్టులు పరిశీలించారు. ఆన్‌లైన్ తరగతులతో పిల్లల తల్లిదండ్రులు తమ గణిత నైపుణ్యాల్ని పెంచుకోవాలని వారు సూచించారు.

ఉప్మా కాదు.. బిర్యానీ కావాలి!

*తిరువనంతపురం: అంగన్ వాడీ కేంద్రంలో అందించే ఆహారంలో తనకు ఉప్మా బదులు బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలని ఓ కేరళ చిన్నారి ముద్దుగా చేసిన అభ్యర్థన అందరి దృష్టిని ఆకర్షించింది. దానిపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. కేరళ శిశు సంక్షేమ శా